క్లుప్తంగా

ఇసుక లారీ స్వాధీనం

నేలకొండపల్లి: ఏపీ నుంచి అక్రమంగా తరలివస్తున్న ఇసుక లారీని స్థానిక పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని మల్కాపురం నుంచి శనివారం హైద్రాబాద్‌కు తరలించేందుకు వయా నేలకొండపల్లి మండలంలోని ఆజయ్‌తండా, చెరువుమాదారం క్రాస్ రోడ్డు వైపు నుంచి వెళ్తుండుగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రైతులను ఆదుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో మూడు రోజులుగా కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టపడి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంలో అకాలవర్షంతో దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.

బీజేపీకే అధికారం

నేలకొండపల్లి: రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమని పార్టీ మండల కార్యదర్శి సూరేపల్లి జ్ఞానరత్నం అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించిన టీచర్లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత పటిష్టంగా చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు కాళంగి వెంకటేశ్వర్లు ఉన్నారు.

24న ధర్నాను జయప్రదం చేయండి

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల పెండింగ్ ఆర్థిక బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వెంకటేశ్వరరావు, ఎస్.విజయ్‌లు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

తిరుమలాయపాలెం: మండలంలోని ఇస్లావత్ తండా పరిధిలోని కేశ్యాతండాలో శ్రీనాగుసాధు గుడి నిర్మాణానికి తిరుమలాయపాలెం సొసైటీ చైర్మన్ చావా వేణు శనివారం శంకుస్థాపన చేశారు. గుడి నిర్మాణానికి పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సర్పంచ్ బోచ మంచానాయక్, ఆర్మీరవి ఆర్థిక సాయం అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

ఖమ్మంరూరల్: నర్సింగ్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెదతండాకు చెందిన ఓ నర్సింగ్ విద్యార్థిని హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల1న ఇంటి నుంచి హైదరాబాద్ వెళ్లడానికి ఆమె తండ్రి బస్సు ఎక్కించాడు. కానీ అక్కడ కళాశాలకు వెళ్లలేదు. దీంతో తెలిసిన వారి, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై రవూఫ్ తెలిపారు.

గోపాలపురంలో వ్యక్తి ..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం గోపాలపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే షేక్ హమీస్ (29) అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదుతో శనివారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే హమీస్ శుక్రవారం ఉదయం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో శనివారం ఆయన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరామర్శ

కూసుమంచి: మండలంలోని గైగోళ్లపల్లి గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు సంగబత్తుల వెంకటరెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా శనివారం ఆయన్ను పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితర నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో మహ్మద్ మౌలానా,జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు సిద్దినేని కరుణాకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, పార్టీ మండల కార్యదర్శి భూక్యా నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	బలగం
సాయిరాం	ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి
ఆదిత్య	కబ్జా
శ్రీనివాస	షాజాం
సుందర్	సింహా

- ఖమ్మం గాంధీచౌక్



స్వయంభూ శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి వెలిసిన దగ్గర భక్తులు పూజలు



దేవాలయ ఆవరణలోని గోశాల నిర్వహణ



భక్తులు కట్టిన ముడుపులు



ఆలయంలో అన్నదానం

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

ముస్తాబైన స్వయంభూ శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి ఆలయం

- 22వ తేదీ నుంచి 19వ వార్షికోత్సవ వేడుకలు

సండే స్పెషల్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీలోని స్వయంభూ అభయ వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 22 నుండి 26వ తేదీ వరకు 19వ వార్షిక బ్రహోత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. 2004 మార్చి 20న ఇక్కడ స్వామి స్వయంగా వెలిసారని రెబ్బల రాజ్యలక్ష్మికి కలలో చెప్పగా.. పూజలు ప్రారంభించారు. 2008 ఏప్రిల్‌లో స్వామి వారిని ప్రతిష్ఠించి ఆలయ నిర్మాణం చేశారు. అప్పటి నుంచి ఏటా ఉగాదికి ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

నిత్యపూజలు, అన్నదానం...

ఆలయంలో ప్రతీ శుక్రవారం స్వామి నిజస్వరూపంలో భక్తులకు దర్శనమిస్తారు. అలాగే, ప్రతీ శనివారం ప్రత్యేక పూజలు, సుమారు 500మందికి పైగా భక్తుల అన్నదానాన్ని దాతల చేయూతతో దేవాలయ కమిటీ కొనసాగిస్తోంది. ఆలయ అవరణలో 2000 సంవత్సరం గోశాల ఏర్పాటు చేయగా పదికి ఆవులను సంరక్షిస్తున్నారు. ఆలయానికి ముఖద్వారం, మండపాన్ని వత్సవాయి రవి దంపతులు నిర్మించగా, రెడ్డిబోయిన సైదయ్య దంపతులు తదితరులు నిర్వహణకు చేయూతనిస్తున్నారు. కాగా, స్వామిని దర్శించుకుని 11ప్రదక్షిణలు చేసి ముడుపు కడితే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మిక. కాగా, ఆలయ 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22నుంచి 26వ తేదీ వరకు జరగనుండగా ఏర్పాట్లు పూర్తయ్యాయి.



శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్) ప్రధాన ద్వారం

దాతల చేయూతతో అభివృద్ధి



ఆలయం 19వ వార్షికోత్సవాలకు ముస్తాబైన వేళ భక్తుల సహాయ సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఇదే సమయాన వేలాది మంది భక్తుల రాక, నిత్య పూజలతో సందడిగా ఉంటోంది. మరింత అభివృద్ధి చేస్తూ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– మేకల వీరన్న, ఆలయ కమిటీ అధ్యక్షుడు

కొన్నేళ్లుగా అన్నదానం



ఆలయంలోని ప్రత్యేక మండపంలో ప్రతీ శనివారం దాతల సహకారంతో అన్నదానం కొనసాగిస్తున్నాం. ప్రతీ శనివారం ఎంతమంది భక్తులు వచ్చినా అన్నదానం చేస్తున్నాం. ఇది కొన్నేళ్లుగా సాగుతుండగా.. భక్తులు సంతృప్తిగా స్వామిని దర్శించుకుని వెళ్తున్నారు.

– గుగులోత్ మణికంఠ, దేవాలయ కార్యదర్శి

స్వామి వారికి నిత్యపూజలు



గత 19 ఏళ్లుగా స్వామికి నిత్య పూజలు జరుగుతున్నాయి. ప్రత్యేకంగా ఇక్కడి స్వామి వారిపై నమ్మకంతో భక్తులు ముడుపులు కడతారు. ప్రతీ శనివారం భారీ సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి వస్తుంటారు. ఇక శుక్రవారం నిజరూపంలో స్వామి దర్శనం, పూజలు ఉంటాయి.

– నరగిరినాథుని రామాచార్యులు, ప్రధాన అర్చకుడు

ఉషా ఫెడరేషన్ కప్‌కు జిల్లా క్రీడాకారులు



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయస్థాయి సీనియర్ ఉషా పోటీలకు జిల్లా క్రీడాకారులు ముగ్గురు రాష్ట్ర జట్టులోకి ఎంపికయ్యారు. ఈమేరకు పి.సత్యజిత్ చారి, జి.రవీందర్, యు.అనసీయ పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జరగునన్న పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఉషా కోచ్, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.పరిపూర్ణాచారి తెలిపారు.

నేడు రాయల నాగేశ్వరరావు సంస్మరణ సభ

తిరుమలాయపాలెం: పిండిప్రోలు సర్పంచ్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ నాయకులు రాయల నాగేశ్వరరావు సంస్మరణ సభను ఆదివారం పిండిప్రోలులో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కార్యదర్శి కమ్మకోమటి నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

ఖమ్మంఅర్బన్: నగరంలోని ప్రశాంతినగర్‌లో విద్యుత్ హెచ్చుతగ్గులతో పలువురి ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. కాలనీలో నిర్మిస్తున్న ఓ ఇంటికి సమీపాన విద్యుత్ హైటెన్షన్ తీగలు ఉండగా.. శనివారం సాయంత్రం ఆ ఇంటికి విద్యుత్ సరఫరా చేయగానే విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ఏర్పడినట్లు సమాచారం. దీంతో సరఫరాలో హెచ్చుతగ్గులు నమోదై పలువురి ఇళ్లలోని విద్యుత్ పరికరాలు కాలిపోయాయని తెలిసింది.

కృషి ఉంటే ఏదైనా సాధ్యమే..



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: కృషి పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని, విద్యార్థి దశలోనే వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అహర్నిశలు కష్టపడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్స్ నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్లు అందించి అభినందించారు. విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జి.కృష్ణ, న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ, ఒలంపియాడ్ ఆర్గనైజర్ రామకృష్ణ, ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి, రైల్వే సీఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

23 మంది ఉద్యోగాలకు ఎంపిక

టీవీఎస్ ట్రైనింగ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐటీ కళాశాలలో రెనాల్ట్ నిసాన్ కంపెనీ నిర్వహించి ప్లేస్‌మెంట్స్‌లో 23 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ విద్యార్థులకు ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ నిర్వహించిన డ్రైవ్‌లో తమ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, సుభాష్‌చందర్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని సాతానిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలను గ్రామస్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. పూజారి చిట్టోజు శివరామకృష్ణాచారి ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. సర్పంచ్ బాదావత్ నాగమణి, ఎంపీటీసీ కీసర మంజుల, ఉప సర్పంచ్ యలమద్ది అలివేలు, గోవిందచారి, అనుమల వెంకటేశ్వర్లు, జువాది వెంకన్న, దుద్దుకూరి రమేష్, రాంబాబు, సంద్ర శివకుమార్, మల్లారెడ్డి, వెంకటాచారి, రంగయ్య పాల్గొన్నారు.

నిధులు కేటాయించకుంటే ఎలా..?




మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్ నాయక్

కూసుమంచి: కొన్ని నెలలుగా పంచాయతీలకు ప్రభుత్వం నిధులు కేటాయించకుండా సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేస్తుందని, తాము ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయామని పలువురు సర్పంచ్‌లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్‌లు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. పంచాయతీలకు నిధులు లేకపోవటంతో వేతనాలు, ట్రాక్టర్ల కిస్తీలు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమావేశంలో ఎస్సై రమేష్‌కుమార్, వైస్ ఎంపీపీ పద్మ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఆలీ, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

నేలకొండపల్లి: గౌతమ్ బుద్ధ చక్రవర్తి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ హస్పిటల్‌లో శనివారం శిబిరాన్ని నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు కట్టెకోల వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, తహసీల్దార్ దారా ప్రసాద్, ఎస్సై జి.స్రవంతి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మైశా శ్రీనివాసరావు, పోలంపల్లి నాగేశ్వరరావు, పీ.వీ.నాగిరెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, దండా శ్రీనివాసరావు, కొమ్మూరి నరేష్, నరేష్ పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ముస్తాబు



రామాలయం వద్ద సిద్ధమైన చలువ పందిళ్లు

- ఖమ్మం పర్ణశాలలో పూర్తికావొచ్చిన ఏర్పాట్లు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 10వ డివిజన్ ఇందిరానగర్‌లోని పర్ణశాల రామాలయంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. భద్రాచలం తరహాలో ఇక్కడ కూడా ఏటా ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు కార్పొరేటర్ చావా మాధురి, దేవాదాయ శాఖ ఈఓ శ్రీకాంత్ ఆధ్వర్యాన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 22 నుంచి 31 వరకు ప్రత్యేక పూజలు జరగనుండగా, 22న ఉగాది వేడుకలు, 30న స్వామి వారి కల్యాణం, అదే రోజు సాయంత్రం సీతారాములకు లకారం ట్యాంకు బండ్‌లో తెప్పోత్సవం, 31న పట్టాభిషేకం, వసంతోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శ్రీకాంత్ మాట్లాడుతూ పర్ణశాల రామాలయంలో కల్యాణోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చివరి దశకు చేరాయని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్ 33/11 కేవీ పరిధిలోని ప్రకాష్‌నగర్ 11 కేవీ, గాంధీచౌక్ 11 కేవీల పరిధిలో మరమ్మతు కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్ -1 ఏఈ మాల్విక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా ప్రకాష్‌నగర్, ఆటో స్టాండ్, ఎరకలకాలనీ, పరుచూరి వారి వీధి, ఫైర్‌స్టేషన్, జహీర్‌పుర స్కూల్, మార్కెట్ లైన్, వడ్డెర కాలనీ, బోస్ సెంటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ముగిసిన శిక్షణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న మహీంద్రా ప్రైడ్ క్లాస్ ట్రైనింగ్ ప్రోగ్రాం శనివారంతో ముగిసినట్లు ప్రిన్సిపాల్ జి.పద్మావతి తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కార్పొరేటు సెక్టార్‌లో ఉద్యోగం పొందటానికి అవసరమైన శిక్షణను విద్యార్థులకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్ కో ఆర్డినేటర్ కె.నర్సింహరావు, టీఎస్‌కెసి మెంటర్ కవిత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాన్లు వితరణ

కూసుమంచి: నాయకన్‌గూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఆరు ఫ్యాన్లను వితరణగా అందించారు. 1987-88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు వీటిని సమకూర్చగా శనివారం సర్పంచ్ కాసాని సైదులు ద్వారా హెచ్‌ఎం భూలక్ష్మికి అందజేశారు పూర్వ విద్యార్థులు చారి, జానీమియా, హనుమంతరావు, మధుసూదన్‌రెడ్డి, నర్సిరెడ్డి, నర్సయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

పండ్లు, భోజనం పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కాటికాపరి జాంబవంతుడు సొసైటీ, హిందూ శ్మశానవాటిక ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి బాబు ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం రావిచెట్టు బజార్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట బిచ్చగాళ్లకు భోజనంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిత్యం శవాలకు అంత్యక్రియలు నిర్వహించే తాము అద్దె ఇళ్లలో ఉంటున్నామని కొంతమంది తమకు ఇళ్లు ఇవ్వటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పంది వేణు, కొలిక సైదులు, కాశయ్య, పడిశాల వీరస్వామి, గట్టికొండ చుక్కయ్య, ఏపూరి తరుణ్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి పోరాడాలి

ఖమ్మంరూరల్: సామాజిక న్యాయాన్ని సాధించాలంటే బీజేపీని ఇంటికి సాగనంపాలని, అందుకోసం పోరాటాలు చేయాలని సీపీఎం మండల నాయకులు ఎస్.కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని పెదతండాలో జనచైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 23న ఎంవెంకటాయపాలెం, 24న తెల్దారుపల్లిలో జరిగే బహిరంగ సభలను జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, మునగాల నాగయ్య, పి.రవీందర్, లక్ష్మయ్య, రామయ్య పాల్గొన్నారు.

ఘనంగా 'విన్‌ఫీల్డ్' వార్షికోత్సవం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాల ఎనిమిదో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలను జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు వ్యక్తిత్వం ముఖ్యమని తెలిపారు. అనంతరం పాఠశాల డైరెక్టర్లు పోలవరపు శ్రీకాంత్, మన్నె కిషోర్‌కుమార్, గద్దె పుల్లారావు తదితరులు మాట్లాడుతూ... విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ ఎంఈఓ శ్రీనివాస్‌తో పాటు కార్పొరేటర్లు చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావు, కూరాకుల వలరాజు, చావా మాధురి నారాయణరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు, డైరెక్టర్లు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నున్నా నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఈ నెల 24న తిరుమలాయపాలెం మండల కేంద్రానికి చేరుకుంటున్న సందర్భంగా నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బహిరంగ సభకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను నిరసిస్తూ ప్రజలను చైతన్యవంతం చేసేందుకు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి రమేష్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, స్వామి, వెంకటేష్, సుధాకర్, వెంకట్రావు, నిర్మల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

తిరుమలాయపాలెం: మండలాభివృద్ధికి సమగ్ర ప్రణాళికను రూపొందించాలని ఎంపీపీ బోడ మంగీలాల్ అన్నారు. శనివారం తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన 2023-24కి సంబంధించి ప్రణాళికపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో ప్రధాన సమస్యలను గుర్తించి పనులను ప్రతిపాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ ఎంపీఓ రాజేశ్వరి ఏఓ సీతారాంరెడ్డి, ఏపీఓ నర్సింహారావు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మా భూమి ఇప్పించండి

ఖమ్మంమయూరిసెంటర్: తమ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, భూమిని వారికి స్వాధీనం చేయాలని కోరుతూ ఖమ్మంకు చెందిన వల్లూరుపల్లి శ్రీ శైలజ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఖానాపురం హవేలి గ్రామ రెవెన్యూ పరిధిలో 2.5 గుంటల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని, ప్రస్తుతం ఆ భూమిపై కోర్టులో కేసు నడుస్తోందని పేర్కొన్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు ఎలాంటి హక్కులు లేకుండా ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఆ భూమిని కొనుగోలు చేసేందుకు తమ దగ్గరికి వచ్చి మాట్లాడి వెళ్లారని, తమ భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

నేలకొండపల్లి: సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపు చేస్తూ ప్రభుత్వం జీవో 11 ను విడుదల చేయటంపై ఉద్యోగులు సంబురాలు నిర్వహించారు. శనివారం సమాఖ్య కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం ప్రతినిధి పెద్దపాక వెంకటేశ్వరరావు మాట్లాడారు. జీవో విడుదల కోసం కృషి చేసిన మంత్రులు, ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు పి.నాగమణి, బానోత్ మోహన్‌రావు, సురేఖ, మంగమ్మ, వెంకటరావమ్మ, నాగమణి, జయమ్మ, లక్ష్మి, శైలజ, నాగమణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఔట్‌పోస్ట్ పరిశీలన

రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలోని కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద పోలీస్ ఔట్ పోస్ట్ నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. ఈమేరకు పనులను శనివారం అదనపు డీసీపీ బోస్ పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. కాగా, కలెక్టరేట్‌కు కుడి పక్కన ధర్నాచౌక్ నిర్మాణం కూడా పూర్తి కావొచ్చింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పనులను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు